# 41. జ్ఞానం- అజ్ఞానం

లోక చైతన్య అనే పేరు పెట్టుకున్న ఓ గురువు ప్రవచనం చెప్తూ, మనుషుల్లోని అజ్ఞానానికి అనేక ఉదాహరణలు ఇస్తూ దాన్ని చీల్చి చెండాడాడు. అది విన్న ఓ జ్ఞాని లోక చైతన్య భార్యని పక్కకి పిలిచి అడిగాడు.

"అమ్మా! నువ్వు వేసుకున్న ఈ బంగారు గాజులు, గొలుసు, వంకీ, నాగవత్తులు నీకు ఎవడు ఇచ్చాడో కాని వాడు పరమ మూర్ఖుడు. గాజులకీ డిజైనేమిటి? ప్లెయిన్‌గా లేకపోతే మురికంటదూ? ఈ గొలుసు పురాతన తవ్వకాల్లోంచి బయటపడితే తెచ్చాడా? ఈ రోజుల్లో మామిడి పిందెల గొలుసు ఎవరైనా చేయించుకుంటారా..."

ఆవిడ బాధపడుతూ ఇతని మాటలని వెంటనే భర్తకి చెప్పింది. అతను జ్ఞానిని పట్టుకుని కోపంగా అడిగాడు.

"నువ్వెవరు నా భార్య నగల మీద విమర్శ చేయడానికి? నువ్వేం కంసాలివా? అందుకు నీకేం అర్హత ఉంది?"

"అదే మాట నేను నిన్ను అడుగుతున్నాను. ముందిది నాకు తేల్చి చెప్పు. మనందరికీ అజ్ఞానాన్ని ఇచ్చింది దేవుడు తప్ప మనం దాన్ని ఆయనకి తెలీకుండా ఎక్కడ నించో తెచ్చుకోలేదు. నువ్వు నీ భార్యకిచ్చిన వాటిని విమర్శిస్తే నీకు అది తప్పుగా తోచిందే? మరి సాక్షాత్తు ఆ భగవంతుడు మానవులకి ఇచ్చిన అజ్ఞానాన్ని నువ్వు విమర్శిస్తే ఆయనకి కోపం రాదా? ఆయనకి కోపం వచ్చేలా ప్రవచనం చెప్పే నువ్వేం భగవత్ భక్తుడివి?"

అతనికి ఏం జవాబు చెప్పాలో తోచలేదు.

"నాయినా! మనకి అజ్ఞానం ఇచ్చిన దేవుడే దాన్ని చీల్చి చెండాడడానికి వివేకం అనే ఖడ్గాన్ని కూడా ఇచ్చాడు. ఆ ఖడ్గాన్ని మనం ఎప్పుడు ఉపయోగించాలి అన్న విచక్షణని కూడా ఆయన మనకి ఇస్తే కాని మనం దాన్ని ఉపయోగించలేం. అన్నిటికీ సర్వాధికారి అయిన ఆ సార్వభౌముడు అందరి ఉద్ధరణ గురించి చూసుకుంటాడు. మాయ గురించి తెలీనివాడు, మాయ గురించి తెలీనివాళ్ళకి,

మాయ గురించి తెలిసినట్లుగా చెప్పకూడదు. ఈ పిచ్చి పిచ్చి ఉపన్యాసాలు కట్టిపెట్టి ముందు నిన్ను నువ్వు ఉద్ధరించుకో చాలు." మృదువుగా కోప్పడ్డాడు జ్ఞాని.

## 42. జ్ఞానం-భక్తి

"స్వామీ! సంపూర్ణ భక్తి వల్ల మోక్షం రాదటగా? అందుకు జ్ఞానం తప్పనిసరి అని, జ్ఞాన మార్గమే మంచి మార్గమని అంటున్నారు. నేను నా మార్గాన్ని మార్చుకోవాలా?" ఓ శిష్యుడు తన గురువుని ప్రశ్నించాడు.

"నీ ప్రశ్నకి సమాధానం 'అవును, కాదు' కూడా. ఎలాగంటే, రామారావు అనే ఓ వ్యక్తి వైద్యుడు. రామారావులో వైద్యుడు వున్నాడు కాని, వైద్యుడులో రామారావు లేడు. రామారావు వైద్యుడు కానప్పుడు కూడా వున్నాడు కాని, రామారావు కాని వైద్యుడు ఎన్నడూ లేడు. నే చెప్పింది ఇంతదాకా అర్థమైందా?" ప్రశ్నించాడు గురువు.

"అర్థమైంది స్వామీ. వైద్యం అనే జ్ఞానం రామారావులో ప్రవేశించేదాకా రామారావు వుత్త రామారావే, తర్వాతే అతను వైద్యుడయ్యాడు."

"కదా? అలాగే నువ్వు ఆ పరమాత్మవే. కాని నీలో ఆ జ్ఞానం ఇంకా కలగలేదు. అది కలిగితే నువ్వు పరమాత్ముడివి అవుతావు."

"వైద్య జ్ఞానం రాకమునుపు రామారావు కూడా ఎలా డాక్టర్‌గా లేడో, అలాగే నేను ఆ పరమాత్ముడినన్న జ్ఞానం నాకు కలగనంత కాలం నేను జీవుడినే అన్నమాట."

"అవును. అయితే పట్టుదలగా వైద్య విద్యని చదివి రామారావు ఎలా వైద్య విజ్ఞానాన్ని సంపాదించుకున్నాడో, అలాగే జీవులు కూడా భక్తి అనే పరిశ్రమ ద్వారా జ్ఞానాన్ని ఆర్జిస్తారు. దైవభక్తి లేకుండా ఆ జ్ఞానం ఎన్నటికీ రాదు."

"అర్థమైంది స్వామీ."

"నిజానికి ఈ పోలిక కూడా సరైంది కాదు. ఇక్కడ రామారావు వేరు. వైద్య జ్ఞానం వేరు. రామారావు తనకి లేని జ్ఞానాన్ని బయట నించి నేర్చుకున్నాడు.